నమస్తే తెలంగాణ
నిజామాబాద్
10 | నిజామాబాద్, ఆదివారం 16 మార్చి 2025 | NIZAMABAD

- ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం
- ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్

**ప్రజలకు** ఇచ్చిన హామీలను అమలు చేయాలని అసెంబ్లీలో ప్రశ్నిస్తే సస్పెన్షన్ వేటు విధించడం ఎంతవరకు సమంజసం అని బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. అసెంబ్లీ సమావేశాల నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బాన్సువాడ, బోధన్, రెంజల్, నవీపేట, ఎడపల్లిలో బీఆర్ఎస్ నాయకులు శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేయడంతో పాటు రాస్తారోకో నిర్వహించారు.

–బాన్సువాడ/ శక్కర్‌నగర్/ రెంజల్/ నవీపేట/ఎడపల్లి, మార్చి 15



పంటను కాపాడుకునేందుకు మరో బోరు నుంచి పైపులు వేసుకుంటున్న రైతు బాల్‌రాజ్

బోరు వేసినా నీరు పడలేదని చూపిస్తున్న రైతు బాల్‌రాజ్



సాటాపూర్‌లో సీఎం దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


# ప్రశ్నిస్తే సస్పెన్షనా?

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై నిరసన జ్వాలలు

బాన్సువాడలోని ప్రధాన రహదారిపై మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ జుబేర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు షేక్ జుబేర్, మోచి గణేశ్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కారని, ఇప్పుడు ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల రవీంద్రభారతిలో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి.. మాజీ సీఎం కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆందోళనకారులకు పోలీసులు నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు. రెంజల్ మండలంలోని సాటాపూర్ తెలంగాణ చౌరస్తాలో బీఆర్ఎస్ మండల మాజీ ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేసి, ధర్నా చేపట్టారు. అంతకుముందు దిష్టిబొమ్మకు ఊరేగింపు నిర్వహించారు. రాఘవేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను బేషరతుగా వెనక్కు తీసుకొని అసెంబ్లీ సభా మర్యాదలను కాపాడాలని కోరారు.

నవీపేటలోని శివాజీ విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేసిన అనంతరం రాస్తారోకో నిర్వహించారు. రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో చేస్తున్న ప్రదేశానికి స్థానిక ఏఎస్సైలు మోహన్‌రెడ్డి, యాదగిరిగౌడ్ చేరుకొని ఆందోళనకారులను సముదాయించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తెడ్డుపోశెట్టి, నవీపేట సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు న్యాలకంటి అబ్బన్న, దొంత ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని మండిపడ్డారు. ఎడపల్లి మండల కేంద్రంలోని సాటాపూర్ గేట్ సమీపంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీరాం, మాజీ ఎంపీపీ కె.శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, నాయకులు హన్మాండ్లు, సురేశ్‌గౌడ్, దశరథ్ పాల్గొన్నారు

బోధన్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడితే సభ నుంచి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం దారుణమన్నారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతతో సీఎం రేవంత్‌రెడ్డికి అసహనం పెరుగుతోందన్నారు. తక్షణమే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.



బాన్సువాడలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి, వినతి పత్రం అందజేస్తున్న నాయకులు



నవీపేటలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# 'బోరు'మంటున్న రైతు

## నాలుగు బోర్లు వేసిన రైతు బాల్‌రాజ్ • మూడు బోర్లు వేసిన ప్రశాంత్

### నీళ్లు రాక పంట పశువుల పాలు

బీబీపేట(దోమకొండ), మార్చి 15: పంట వేసి నాలుగు గింజలు పండించి.. ఎంతో కొంత సంపాదించుకుందామని అనుకున్న అన్నదాతకు నిరాశే ఎదురవుతున్నది. బోరు బావులను నమ్ముకొని పంటలు సాగుచేయగా.. ఒక్కసారిగా భూగర్భ జలాలు తగ్గిపోయాయి. దీంతో సాగుచేసిన వరికి తడి అందక, పంట పండే పరిస్థితి లేకుండా పోతున్నది. బోర్లు వేసినా.. చుక్క నీరు పడకపోవడంతో రైతులు బోరుమంటున్నారు. పంటపై ఆశలు వదులుకొని, ఆవేదన చెందుతున్నారు. కండ్ల ముందే పంట ఎండిపోతుండడంతో కన్నీళ్లు పెట్టుకోవాల్సి వస్తున్నది.

దోమకొండ మండల కేంద్రంతోపాటు సంగమేశ్వర్, గొట్టిముక్కల తదితర గ్రామాల్లో రైతులు వరి సాగు చేశారు. మార్చిలోనే మండుతున్న ఎండలకు భూగర్భ జలమట్టం తగ్గింది. దీంతో బోర్లు సరిగ్గా నీరు పోయడం లేదు. దీంతో వేసిన పంటలో సగం పొలానికైనా నీళ్లు పెట్టి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరో బోరు వేయించినా.. నీరు పడకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దోమకొండకు చెందిన పిప్పిరి బాల్‌రాజ్ తనకున్న రెండున్నర ఎకరాల్లో వరి సాగుచేశాడు. పంటను కాపాడుకునేందుకు సుమారు రూ.4.5లక్షలు ఖర్చుచేసి ఒక్కో బోరును 500ఫీట్ల వరకు నాలుగు బోర్లు తవ్వించాడు. మూడు బోర్లలో నీరు పడలేదు. ఒక్కబోరు కూడా సరిగా పోయకపోవడంతో ఎకరం వరకు పంట ఎండిపోయింది. పంట కోసం పెట్టిన పెట్టుబడి ఖర్చులు ఎలా వస్తాయని రైతు ఆందోళన చెందుతున్నాడు.

దోమకొండకు చెందిన మరో రైతు బి.ప్రశాంత్ తనకున్న మూడు ఎకరాల్లో వరి వేశాడు. నీటి కోసం రూ.2.50లక్షలు ఖర్చు చేసి మూడు బోర్లు తవ్వించగా.. ఒక్కదాంట్లో మాత్రం నీళ్లు పడ్డాయి. ఆ బోరుకూడా ప్రస్తుతం ఎండలకు సరిగా నీళ్లు పోయడం లేదు. దీంతో ఎకరన్నర వరకు పొలం ఎండిపోయింది. పంట సాగు కోసం ఇప్పటికే రూ.50వేల వరకు ఖర్చు అయ్యిందని రైతు తెలిపాడు. ఉన్న ఎకరన్నర పొలం కాపాడుకునేందుకు రాత్రి కరెంటు కావడంతో పొలం వద్దనే పడుకుంటున్నట్లు తెలిపాడు. ఎండిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.



ఎండిన పొలంలో దిగాలుగా కూర్చున్న యువరైతు ప్రశాంత్

# రంగుమారిన భగీరథ నీరు



- పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి కలుషితమైన నీళ్లు
- అలాగే సరఫరా చేస్తున్న అధికారులు
- ఆందోళన చెందుతున్న గ్రామస్తులు

బిచ్కుంద, మార్చి 15: మిషన్ భగీరథ నీళ్లు రంగుమారాయి. దీంతో గ్రామస్తు లు ఆందోళన చెందుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాలని ఉద్దేశంతో ప్రవేశపెట్టిన 'మిషన్ భగీరథ' నీళ్లు ప్రతి పల్లెకూ ఇప్పటికీ అందుతున్నాయి. ఈ క్రమం లో కామారెడ్డి జిల్లా బిచ్కుంద మం డల కేంద్రంతోపాటు పలు గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ భగీరథ నీరు సరఫరా అవుతున్నది. అయితే కొన్నిరోజులుగా నీరు కలుషితమై రంగుమారి సరఫరా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రత్యేక అధికారులు ఉన్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. క్లోరినేషన్ చేసిన నీటిని అందిస్తున్నామని అధికారులు చెబుతున్నా ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, పంచాయతీ అధికారుల మధ్య సమన్వయం కొరవడడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడంలేదని కింది స్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు

### పైప్‌లైన్‌కు లీకేజీ..

మండల కేంద్రంలోని ప్రశాంత్ కాలనీకి వెళ్లే దారిలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ మరమ్మతుల జేసీబీతో ఓ భారీ గుంతను తవ్వి వదిలేశారు. దీంతో భగీరథ నీరు వచ్చి గుంతలో నిండిపోయి కలుషితమై సరఫరా అవుతున్నది. కలుషితంతోపాటు రంగుమారడంతో నీళ్లను తాగడానికి గ్రామస్తులు జంకుతున్నారు. మిషన్ భగీరథ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ప్రశాంత్ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కేసీఆర్ నల్లా నీళ్లు కావాలి..



రెండు నెలల నుంచి మిషన్ భగీరథ నీళ్లు పచ్చ రంగులో వస్తున్నాయ్. నాకు మోకాళ్ల నొప్పుల కారణంగా ఫిల్టర్ డబ్బా నీళ్లు తాగ డంలేదు. కేసీఆర్ నల్లా నీళ్లు తాగుతాం. ఈ నీళ్లు కలుషితమై వస్తున్నయ్. మంచి నీళ్లు వచ్చేలా పెద్ద సార్లు చూడాలి.

**-పద్మిని బాయి,గృహిణి**

### సింగూర్ డ్యామ్‌లో నాచు పేరుకుపోయింది..

రంగు మారుతున్న నీళ్లు రావడం వాస్తవమే. సింగూరు డ్యామ్‌లో నాచు పేరుకుపోవడంతో నీరు పచ్చరంగులో వస్తున్నది. అయినప్పటికీ క్లోరినేషన్ చేస్తున్నాం.ఆ నీటి వల్ల ఎలాంటి ఇబ్బందులు రావు. మండల కేంద్రంలో పైప్‌లైన్ లీకేజీ మరమ్మతుల కోసం గుంతను తవ్వగా ఒకే చోట రెండు లీకేజీలు ఏర్పడడంతో సమస్య పెద్దగా మారింది. మరమ్మతులు చేయడానికి కనీసం నాలుగు రోజుల సమయం పడుతుంది. ఎండాకాలం ఆరంభం కావడంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తుతాయని భావించి మరమ్మతులను నిలిపివేశాం. అత్యవసర సమయంలో సింగూర్ నుంచి నీటి సరఫరా నిలిపివేసినప్పుడు మరమ్మతులు చేపడుతాం.

**-కౌశిక్, మిషన్ భగీరథ డీఈ**



రంగు మారి వస్తున్న కలుషిత మిషన్ భగీరథ నీరు



బిచ్కుంద మండలకేంద్రంలోని ప్రశాంత్ కాలనీకి వెళ్లే దారిలో పైప్‌లైన్ మరమ్మతుల కోసం తవ్విన గుంత

# రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ తప్పుడు లెక్కలు

- బాల్కొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలోనే రైతులకు ఎక్కువ లబ్ధి
- తప్పని రుజువు చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా..!
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



మోర్తాడ్, మార్చి 15: రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతూ సభను తప్పుదోవ పట్టించిందని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ కంటే బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.546 కోట్లు ఎక్కువ చేసింది, దీనికి నేను కట్టుబడి ఉన్నానన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో కేసీఆర్ మొదటి విడుతలో రూ.236కోట్లు, రెండో విడుతలో రూ.86కోట్లు రుణమాఫీ చేసిందన్నారు. బట్టివిక్రమార్క అసెంబ్లీలో మాట్లాడుతూ.. కేసీఆర్ బాల్కొండలో రుణమాఫీ రూ.82.12కోట్లు మాత్రమే చేస్తే, తాము రూ.169కోట్లు చేశామని చెప్పారని, కానీ కేసీఆర్ రెండు విడుతల్లో రూ.318కోట్లు చేస్తే కాంగ్రెస్ చేసింది రూ.169కోట్లు మాత్రమేనని, కాంగ్రెస్ కంటే రూ.148కోట్లు బీఆర్ఎస్ రుణమాఫీ ఎక్కువ చేసిందన్నారు. దీనికి తాను కట్టుబడి ఉన్నానని, తప్పని రుజువు చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రశాంత్‌రెడ్డి సవాల్ విసిరారు. లేదంటే మీరు ఏ శిక్ష విధించుకుంటారో కానీ...ప్రజలను మాత్రం తప్పుదోవ పట్టించవద్దని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో 2,03,520 మంది రైతులు ఉంటే అందులో 49శాతం రైతులకు రుణమాఫీ చేశారని, ఇంకా 1,02,965మంది రైతులకు రుణమాఫీ కాలేదని చెప్పారు. బాల్కొండ నియోజకవర్గంలో 51,128 రైతులకు రుణమాఫీ చేసింది కేవలం 19,675 మంది రైతులకు మాత్రమే అంటే 38శాతం మంది రైతులకు మాత్రమే అన్నారు. ఇంకా 31,458 మందికి అంటే 62శాతం రుణమాఫీ కాలేదన్నారు. తప్పుడు లెక్కలు చెప్పి సభను తప్పుదోవ పట్టించొద్దన్నారు. తాను లెక్కలతో సహా నిజాలు చెప్పానని, సీఎం రేవంత్‌రెడ్డి సమాధానంలో మాత్రం క్లారిఫికేషన్ లేదన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని ఎమ్మెల్యే వేముల అన్నారు.

## బామ్మ @120



*120 ఏండ్ల బామ్మ..*

తన పనులను తాను చేసుకుంటూ అందరినీ ఔరా అని ఆశ్చర్యపరుస్తోంది. ధర్పల్లి మండలంలోని దమ్మన్నపేట్ గ్రామానికి చెందిన గయాన బాబాయి నూటా ఇరవై ఏండ్లు ఉంటాయి.. ఆమెకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు కాగా.. ఇప్పుడు మనుమలు, మునిమనుమలు, మనుమరాండ్లతో ఆ కుటుంబం అలరారుతున్నది. మంచి ఆహార పదార్థాలను తీసుకోవడమే ఆమె ఆరోగ్య రహస్యమని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబీకులు శనివారం ఆమెకు పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు.

–ధర్పల్లి, మార్చి 15

# దోమకొండలో నకిలీ ధ్రువపత్రాల కలకలం

ఇద్దరిపై కేసు నమోదు

బీబీపేట (దోమకొండ), మార్చి 15: నకిలీ ధ్రువపత్రాలు దోమకొండలో కలకలం రేపాయి. ఈ విషయమై పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. దోమకొండ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి చాకచక్యంగా వ్యవహరించడంతో విషయం బయటపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. దోమకొండకు చెందిన చింతల రవీందర్ నకిలీ మనీ వాల్యూ ట్యాక్స్ రశీదులు తయారు చేశాడు. వాటిని ఇటీవల కోర్టులో సమర్పించి జామీను పొందేందుకు యత్నించాడు. పత్రాలను మెజిస్ట్రేట్‌కు సమర్పించేందుకు ప్రయత్నించగా.. అక్కడున్న వారు గమనించి దోమకొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి యాదగిరికి సమాచారం అందించి, అతడికి వాట్సాప్ ద్వారా పంపించారు. గమనించిన పంచాయతీ కార్యదర్శి తన సంతకం పోర్జరీ చేసినట్లు గుర్తించాడు. స్థానిక పోలీసులకు బుధవారం ఫిర్యాదుచేశాడు. గ్రామానికి చెందిన మంగళిపల్లి శ్రావణ్ తనతోపాటు పెద్దమ్మ రాజమణి పేరుతో గోల్డ్‌లోన్ తీసుకున్నాడు. తన పెద్దమ్మ ఆరోగ్యం బాగా లేదని గ్రామ పంచాయతీ నుంచి నకిలీ ధ్రువపత్రాలు తయారు చేసి వాటిని తీసుకెళ్లి బంగారాన్ని విడిపించుకున్నాడు. అది కూడా నకిలీ పత్రం అని తేలింది. దీంతో ఇద్దరిపై దోమకొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి యాదగిరి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు వారిపై శుక్రవారం రాత్రి పోర్జరీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్రవంతి శనివారం తెలిపారు. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉన్నదనే కోణంలో భిక్కనూరు సీఐ కార్యాలయంలో కూలీ లాగుతున్న పోలీసులు.. మరో ఇద్దరికి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.



**ఎల్లారెడ్డి మండలంలోని** మత్తమాల గ్రామ మాజీ సర్పంచ్ కిషన్‌రెడ్డి ధన్వంతరి మహాయజ్ఞం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి పాట్నా హైకోర్టు జడ్జి అనుపమ దంపతులతోపాటు నిజామాబాద్ జిల్లా జడ్జి సునీత కుంచాల శనివారం హాజరయ్యారు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై బొజ్జ మహేశ్ బందోబస్తు నిర్వహించారు.

–ఎల్లారెడ్డి రూరల్, మార్చి 15